ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు



5

ఆదివారం 7 సెప్టెంబరు 2025

అధికారులపై చర్యలు ?

తురకపాలెంలో వరుస మరణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఆ మేరకు ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించినట్లు తెలుస్తుంది. ఒకరిద్దరు జిల్లా అధికారులు మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లుగా నిఘా వర్గాలు కూడా తేల్చినట్లు సమాచారం.



నిర్లక్ష్యమే.. శాపం

తురకపాలెంలో 29 మంది బలి

- వరుస మరణాల్లో విస్తుపోయే వాస్తవాలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ఆరోగ్యశాఖ
- ప్రజాప్రతినిధులు చెప్పినా స్పందనలేని అధికారులు
- ఒక్కో నెలలో పది మంది మరణించినా పట్టించుకోని వైనం

ఒకరు.. ఇద్దరు కాదు.. 29 మంది మరణించారు. అదీ మూడు నెలల్లోనే. అదేమన్నా మారుమూల గ్రామం.. సమా చారం తెలుసుకోవడం కష్టం అంటే జిల్లా కేంద్రమైన గుంటూరుకు కూతవేటు దూరంలోనే ఉంది. సరే అదేదో పెద్ద గ్రామం నెలలో పది మరణాలు సర్వ సాధారణం అనుకునేందుకు కూడా ఆస్కారం లేదు. ఐదారొందల కుటుం బాలు.. 2300 జనాభా ఉన్న ఓ చిన్న గ్రామం. అయినా వరుస మరణాలు.. అదీ జ్వరం, దగ్గు, ఆయాసం లాంటి సాధారణ రోగాలతో అత్యంత తక్కువ రోజుల్లోనే మరణాలు సంభవించాయి. అయినా వైద్య ఆరోగ్య శాఖతో పాటు జిల్లా స్థాయి అధికారుల్లో కనీస స్పందన లేదం టే వారెంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో తెలుసుకోవచ్చు. ఒకే నెలలో.. ఒకే ఊరిలో డజన్ల కొద్దీ సంఖ్యలో మరణిస్తుంటే జిల్లా ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నారన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. మీడియాలో కథనాలు వచ్చిన తర్వాత రాష్ట్ర స్థాయి అధికారులు హెచ్చరించిన తర్వాత ఇప్పుడు హడావుడి చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూలైలోనే స్పందించి ఉంటే మరణాలను తగ్గించే అవకాశం ఉండేది కదా అన్న అభిప్రాయాలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం 29 మందిని బలితీసుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(గుంటూరు సిటీ, తెనాలి ఆంధ్రజ్యోతి)

గుంటూరు నగర శివార్లలోని ఓ చిన్న గ్రామం తురకపాలెం. ఈ గ్రామం ఇప్పుడు రాష్ట్రవ్యాప్త సంచలనమైంది. వరుసగా.. సాధారణ జబ్బులతో చికిత్సలు పొంది ఇళ్లకు వచ్చిన తర్వాత అంతు చిక్కని రీతిలో సంభవిస్తున్న మరణాలతో గ్రామస్థులు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటనలు.. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల వైద్య శిబిరాలతో హడావుడి చేస్తున్నారు. అదే తొలుతే అధికారులు స్పందించి ఉంటే మరణాలు కొన్ని అయినా తగ్గి ఉండేవి కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓ చిన్న గ్రామంలో డజన్ల కొద్దీ మరణాలు సంభవించినా వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతోనే వరుస మరణాలు సంభవించాయన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం.. 29 మంది పాలిట మరణశాసనమైందన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రమైన గుంటూరుకి నాలుగైదు కిలో మీటర్ల దూరంలోని తురకపాలెం గ్రామంలో కేవ లం జ్వరం.. దగ్గు.. ఆయాసంతో బాధపడతూ 29 మంది మరణించారంటే వైద్య ఆరోగ్య శాఖలోని నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. సా ధారణంగా ఒక్కరు చనిపోయినా హడావిడి చేసే వైద్య, ఆరోగ్యశాఖ తురక పాలెంలో ఇంత మంది వరుసపెట్టి మరణిస్తున్నా చోద్యం చూస్తూ కూర్చుంది. వరుస మరణాల విషయం సంచలనంగా మారి.. రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగే వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. సాధారణంగా ఒక డయేరియా మరణం సంభవిస్తే దానికి సంబంధించిన సమాచారం 24 గంటల్లో ప్రపంచ ఆరో గ్య సంస్థకు తెలియజేయాలి. మరి జ్వరంతో ఎవ రైనా మరణించినా.. అది కూడా సీరియస్ అంశమే. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలి. గుంటూరు సమీ పంలోని తురకపాలెంలో సంభవించిన మరణాల విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ అటువంటి చర్యలు (మిగతా 8వ పేజీలో)



గ్రామస్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



నిర్మానుష్యంగా తురకపాలెం వీధులు



గ్రామంలో ముమ్మరంగా సహాయ చర్యలు

అనుమానితుల నుంచి రక్తనమూనాల సేకరణ

గుంటూరు మెడికల్ : వరుస మరణాలు.. వీడని జ్వరాలతో బీతిల్లిన తురకపాలెంవాసులకు వైద్యంతో పాటు ఆహారం, తాగునీటిని అధికారులు అందిస్తున్నారు. శుక్రవారం సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్షతో శనివారం ఆయా శాఖలకు చెందిన అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే చేపట్టి రక్తనమూనాలు సేకరించింది. మెలియోయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానిస్తున్న నేపథ్యంలో మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యులు గ్రామాన్ని సందర్శించారు. మరో పక్క గ్రామస్థులకు శనివారం భోజన సదుపాయం కల్పించారు. మూడు రోజుల పాటు అందరికీ ఉచితంగా భోజనం ఏర్పాటు చేసినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అందరికీ మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. ప్రజా, వైద్య సంఘాలు, సేవా సంస్థల ప్రతినిధులు నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి శనివారం గ్రామంలో పర్యటించారు.

పరిస్థితులు అదుపులో ఉన్నాయి..: కలెక్టర్

గుంటూరు : తురకపాలెంలో పరిస్థితులు అదుపులో ఉన్నాయని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గ్రామంలోని పరిస్థితుల గురించి శనివారం మీడియాకు వివరించారు. 650 ఇళ్లలో సర్వే నిర్వహించి సింప్టమెటిక్ కేసులకు సంబంధించి 56 మందికి బ్లడ్ కల్చర్ తీసి మెడికల్ కళాశాలకు పంపించామన్నారు. 50 బృందాలతో గ్రామంలోని అన్ని ఇళ్లకు వెళ్లి ఆరోగ్యానికి సంబంధించి 41 అంశాలపై సర్వేను శనివారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్స్ బృందం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి కార్యక్రమాల ను పర్యవేక్షిస్తుందన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 895 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 2,850 మందికి ఉపాహారం, 3500 మందికి మధ్యాహ్న భోజనం అందించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించామన్నారు. ప్రాం తీయ లేబరేటరీలలో నీటి నమూనాలను పరీక్షించగా అందులో ఎటువంటి హానికర రసాయనాలు, పదార్థాలు లేవని నివేదిక వచ్చిందన్నారు. అనధి కార మద్యం విక్రయాలు లేవని తేలిందన్నారు. క్వారీ లీజులపై తనిఖీలు చేపట్టామన్నారు. గాలి నాణ్యత పర్యవేక్షణ ప్రారంభించామన్నారు.



సండే స్పెషల్

తింటే.. తంటా

రూ.5 నుంచి అందు బాటులో ఆకట్టుకుంటున్న రుచికరమైన విషం పిల్లల ఎదుగుదలతో పాటు ప్రాణాలను హరిస్తోంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్ పిల్లలను ఆకట్టుకుంటుండగా.. తక్కువ ధర కావడంతో పెద్దలు పెద్దగా పట్టించుకోవడం లేదు. చివరకు జంక్‌ఫుడ్ పిల్లల పాలిట విషాహారంగా మారుతోంది. వారి ఎదుగు దలపై ప్రభావంతో పాటు రకరకాల ఆరోగ్య సమస్యలకు కారణంగా మారుతోంది. నిషేధిత రసాయనాలతో తయారు చేస్తున్న జంక్ ఫుడ్‌లను యథేచ్ఛగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీటి కొనుగోళ్లను నియం త్రించాల్సిన పెద్దలు వాటినే చిరుతిళ్లుగా అందిస్తూ.. పిల్లల ఆరోగ్యాల్ని హరిస్తున్నారు. కోరి మరీ.. కొనుగోలు చేసి.. భావి భారతాన్ని అనారోగ్యం పాలు చేస్తుండటంలో అటు వ్యవస్థ లు.. ఇటు తల్లిదండ్రులు కీలక పాత్రదారులుగా మారుతున్నారు.

రుచికరమైన విషం జంక్‌ఫుడ్

- ఆరోగ్యంపై ప్రభావం చూపుతోన్న చిరుతిళ్లు
- అరికట్టకపోతే చిన్నారుల్లో రక్తహీనత, ఊబకాయం

నరసరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జంక్‌ఫుడ్.. రుచికరమైన విషం. ఇది పిల్లల ప్రాణాలను హరిస్తోంది. పిల్లలు పాఠశాలకు వెళ్లినప్పుడు.. సెలవుల్లో ఇళ్ల వద్ద ఏమి కొని తింటున్నారనే విషయం పట్టించుకోని పెద్దల నిర్లక్ష్యం వారి ఆరోగ్యాన్ని, భవితను చిదిమేస్తోంది. చిన్నారుల జీవితాల్ని శాసిస్తున్న చిరుతిళ్లు వారికి బలమివ్వకపోగా ప్రమాదంలోకి నెడుతున్నాయి. జంక్‌ఫుడ్ భారిన పడితే ఆ ప్రభావం చిన్నారులపై జీవితాంతం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మద్యం చేసే నష్టం కంటే జంక్‌ఫుడ్ ఇంకా ఎక్కువ నష్టం చేస్తోంది. జం క్‌ఫుడ్ భారిన పడే వారి సంఖ్య రోజు రోజుకు అధికమవుతుంది. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువుపై దృష్టి పెట్టినట్లుగానే వారు ఏమి తింటున్నారనే దాన్ని కూడా పరిశీలించాల్సిన బాధ్యత పెద్దలదే. పిల్లలకు జంక్‌ఫుడ్ కాకుండా ఫ్రూట్ సలాడ్‌లు, పల్లీలు, బెల్లం (మిగతా 8వ పేజీలో)

పొట్టలో పేరుకుపోతున్న వ్యర్థాలు

చిన్నపిల్లలు సరాసరిన రోజుకు 30 నుంచి 50 గ్రాముల వరకు జంక్‌ఫుడ్, చాక్లెట్లను తింటున్నారని ఒక అంచనా. ఈ కారణంగా వారి పొట్టలో 30 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు వ్యర్థాలు ఉంటున్నాయి. ఫాస్ట్‌ఫుడ్‌లో వాడే మైదా, నూనెలతో విష, కొంకి, బద్దెపురుగులు, ఏలికపాములు వంటివి శరీరంలోకి చేరుతున్నాయి. ఇవి ఎముకల ఎదుగుదలపై ప్రభావం చూపుతుంటాయి. జంక్‌ఫుడ్ వ్యర్థాలు దేహంలో పేరుకుపోవడంతో బాలికల్లో రక్తహీనత, బాలురులో ఊబకాయం పెరుగుతుంది. సరిగ్గా ఆహారం తినకపోయినా లావుగా కనిపిస్తుంటారు.

పౌష్టికాహారంతోనే.. రోగ నిరోధక శక్తి

గత పదేళ్లుగా పిల్లల ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. జంక్‌ఫుడ్ ప్లాస్టిక్‌తో సమానం. అది జీర్ణం కాక శరీరంలో పేరుకు పోతుంది. దాని వైపు నుంచి పిల్లల దృష్టి మరల్చాలి. పీచు, బలవర్థక పోషకాలు అందించాలి. సంప్రదాయ ఆహారాన్ని తీసుకునేలా పిల్లల్ని ప్రోత్సహించాలి. పండ్లు, ఇతర ఆహార పదార్థాలతో భిన్న వంటకాలను తయారు చేసి అందించాలి.



- భువన, డైటీషియన్, గుంటూరు



సూర్యఘర్‌కు 90 వేల మంది నమోదు

నెల రోజుల్లో సౌర ప్యానళ్లు ఇన్‌స్టాల్ చేయాలి ● అధికారులకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదేశం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకానికి 90 వేల మంది నమోదు చేసుకున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. వీరికి నెల రోజుల్లో సౌర ప్యానళ్లు ఇన్‌స్టాల్ చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సూర్యఘర్ పథకంపై శనివారం కలెక్టరేట్‌లో ఎంపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, వెండర్లు, బ్యాంకర్ల సమన్వయంతో ప్రజలకు సోలార్ వినియోగంపై అవగాహన కల్పించి పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. వంద కుటుంబాలు లక్ష్యం చేసుకుని ఒక్కో గ్రామాన్ని ఒక్కో వెండర్‌కు అప్పగించి తద్వారా సత్వరం పనులు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ సూర్యఘర్ పథకానికి సంబంధించి సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. సరైన రిజిస్ట్రేషన్లు లేని ఇళ్లకు ఇంటి పన్ను రసీదు ఆధారంగా రుణం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విద్యుత్‌శాఖ అధికారి డాక్టర్ కే విజయ్‌కుమార్, వెండర్లు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు

తాగు నీరు వృథా.. అరికట్టకపోతే ఎలా?



పైపు లైను నుంచి లీకవుతున్న నీరు



రావిపాడులో ప్రధాన పైపులైన్ వాల్ పిట్ నుంచి రక్షిత నీరు నెల రోజులుగా వృథా



కలప షాపు వద్ద తాగు నీరు లీకేజి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మునిసిపాలిటీలో తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ కొరవడింది. నెలల తరబడి తాగు నీరు వృథా అవుతోంది. శాంతినగర్‌లోని నీటి శుద్ధి ప్లాంట్ నుంచి శుద్ధి చేసిన నీటిని పట్టణానికి సరఫరా చేసే ప్రధాన పైపు లైనుకు పలు ప్రాంతాల్లో లీకులు ఏర్పడ్డాయి. వీటిని అరికట్టడంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. రావి పాడులో వాల్‌పిట్ నుంచి నెల రోజులుగా నీరు వృథా అవుతోంది. దీనిపై మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలి పారు. పెట్రోల్ బంకు ఎదురుగా పైపు లైనుకు రెండు భారీ లీకులు ఏర్ప డ్డాయి. దీంతో మట్టి, మురుగు పైపులైనులోకి చేరి నీరు కలుషితం అవుతోం ది. పైపు లైన్‌లీకులను పూడ్చి నీటి వృథాను పురపాలకులు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత నెల 31 రాత్రి మాచర్ల ప్రాంతంలో జరిగిన దారి దోపిడీ కేసుకు సం బంధించి 9 మంది నిందితులను అరెస్టు చేసి నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి రెండు కార్లు, మూడు కత్తులు, రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ ప్రకటించారు. గుంటూరు చంద్రమౌళినగర్‌కు చెందిన మహి మ క్రాంతి మంగళగిరికి చెందిన లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్‌లో పని చేసేవాడు. యజమాని నుంచి నగదు దోచుకోవాలని భార్య, మరి కొందరితో కలిసి పథకం రూపొందించాడు. ఈ క్రమంలో ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన బంగారం విడిపించాలని కాంత్రి భార్య రాధిక చేత యజమానికి ఫోన్ చేయించాడు. దీంతో యజమాని ఏ.మహేష్‌బాబు అనే వ్యక్తి కి నగదు ఇచ్చి గత నెల 31 రాత్రి పంపారు. దీంతో మహేష్‌బాబు మాచర్ల నుంచి సాగర్ వెళ్లే రోడ్లో ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్దకు రప్పించిన కాంత్రి ముఠా అతడి నుంచి 5 లక్షల నగదు తీసుకుని పారిపోయింది. దీంతో జరిగిన ఘటనపై అప్పటికప్పుడే మహేష్‌బాబు మాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పొందుగల, గుంటూరులో నిందితులను గుర్తించి శనివారం అరెస్టు చేసింది. నిందితుల్లో మంగళగిరిలోని దీనదయాళ్‌నగర్‌కు చెందిన కర్నే రాము, గుంటూరులోని పి.మహిమ క్రాంతి, ఎం ప్రసీన్‌బాబు, వల్లూరి సాయిరాం, పి.రాధిక, నాగరాజు, ఎస్ వెంకట శివరా మకృష్ణ, కే లక్ష్మీబాబు, ఏ లీలనాగలోకేశ్ ఉన్నారు. వీరిలో ఆరుగురిపై గతంలో పలు కేసులున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి జగ్గారావు

నరసరావుపేట రూరల్, నాదెండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం జగ్గారావు తెలిపారు. జొన్నలగడ్డ సొసైటీ, నాదెండ్ల మండలం సాతులూరులోని రైల్వే ఎరువుల ర్యాక్ పాయింట్‌తో పాటు నాదెండ్ల పీఏసీఎస్ గోడౌన్‌లో శనివారం ఆయన తనిఖీలు చేశారు. ఎరువులు కేటాయింపుల ప్రకారం సరఫరా అవుతున్నాయా? లేదా? అనే విషయంపై ఆరా తీశారు. సొసైటీల్లో స్టాక్ వివరాలు పరిశీలించారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, విస్తరణ అధికారి గోపిరెడ్డి, ఏవో శ్రీలత తదితరులు ఆయన వెంట ఉన్నారు.



నాదెండ్లలో ర్యాక్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

దసరా నుంచి ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం ప్రకటించారు. ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులపై ఆదివారం గుంటూరు ఎన్జీవో హోమ్‌లో అవగాహనా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దసరా నుంచి లక్ష్మీపురంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పక్కనున్న తన కార్యాలయంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకూ నోటిఫికేషన్లు వస్తుంటాయని, యూపీఎస్సీ, ఏపీపీఎస్సీలపై పెట్టినంత దృష్టి ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఎస్‌బీఐ పరీక్షలపై అభ్యర్థులు పెట్టడం లేదని అన్నారు. అలాంటివారికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. సెప్టెంబరు 8 నుంచి అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టి, ఈ నెల 28న ఆన్‌లైన్లో ప్రవేశపరీక్ష జరిపి, ఉత్తీర్ణులైనవారికి కోచింగ్ ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, ఏఎస్ రామకృష్ణ, విజయసాధన కిశోర్, ఎన్నారై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్, కోచింగ్ ఇచ్చే అధ్యాపకులు పాల్గొంటారని ఆలపాటి తెలిపారు.

లాంఫాం కేవీకేకు జాతీయస్థాయి గుర్తింపు : యుగంధర్‌కుమార్



ప్రశంసాపత్రం అందుకుంటున్న లాంఫాం కేవీకే అధిపతి యుగంధర్‌కుమార్


లాంఫాం(తాడికొండ) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రాని (కేవీకే)కి జాతీయస్థాయిలో గుర్తింపు దక్కిందని దాని అధిపతి డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ శనివారం తెలిపారు. తమిళనాడులోని వెల్లూరులో దక్షణాది రాష్ట్రాల కేవీకే వార్షిక జోనల్ వర్క్‌షాపును నిర్వహించారని చెప్పారు. గ్రామీణ యువత, విస్తరణా సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమాల విభాగంలో జాతీయ స్థాయిలో లాంఫాం కేవీకేకు గుర్తింపు లభించడంతో ప్రశంసాపత్రాన్ని అందించారని యుగంధర్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఐసీఏఆర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వీసీలు, విస్తరణ సంచాలకులు, కేవీకేల సమన్వయకర్తలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

అదనపు, అనధికార పొగాకు ఉత్పత్తిపై సర్వీసు ఛార్జీల విధింపు

● కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరి కేసంగ్ వై షెర్పా

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 2024-25 పంట సీజన్‌కు సంబంధించి కొన్ని షరతులతో అదనంగా సాగు చేసిన, అనధికారికంగా ఉత్పత్తి జరిగిన ఎఫ్‌సీవీ (ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా) పొగాకుని రిజిష్టర్డ్ ట్రేడర్లు, డీలర్లు కొనుగోళ్లు జరిపేందుకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ప్రధానంగా పంట సీజన్‌లో ప్రతీ రిజిష్టర్డ్ ఉత్పత్తిదారుడు తనకు అనుమతించిన దాని కంటే అదనంగా పండించిన పొగాకులో 10 శాతం కోటాని ఒక శాతం సాధారణ సర్వీసు ఛార్జీని పొగాకు బోర్డు ఫండ్‌కు చెల్లించి విక్రయించుకొనేలా అవకాశం కల్పించింది. అదనంగా 10 శాతం నుంచి 20 శాతం లోపు పొగాకు పండించిన రైతులు కేజీకి రూపాయి, 2 శాతం సర్వీసు ఛార్జీని చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా 20 శాతం కంటే మించి పొగాకు పంటని పండించినట్లు అయితే కేజీకి రూపాయి, మూడు శాతం సర్వీసు ఛార్జీని చెల్లించాలి. ఇది సాధారణంగా రైతులు చెల్లించే ఒక శాతం సర్వీసు ఛార్జీకి అదనంగా ఉంటుంది. అనధికార రైతులు కేజీకి రూపాయి, ఐదు శాతం సర్వీసు ఛార్జీని చెల్లించి వేలం కేంద్రాల్లో పొగాకుని విక్రయించుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరి కేసంగ్ వై షెర్పా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకాశం బ్యారేజి నుంచి 43,500 క్యూసెక్కుల నీటి విడుదల



తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా పెరిగింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి శనివారం ఇన్‌ఫ్లోగా 62,347 క్యూసె క్కుల వరదనీరు బ్యారేజీకి వచ్చి చేరినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజ ర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోద వుతుండగా దిగువకు 43,500 క్యూసె క్కుల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. తూర్పు డెల్టా కాలువకు 10,433 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 198 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజేశ్ తెలిపారు.

స్వచ్ఛ వాతావరణమే... భావితరాలకు ఊపిరి

జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనాబేగం

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలిని భావితరాలకు అందించేందుకు నేటి తరం కృషి చేయాలని జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం అన్నారు. స్థానిక ఏటి అగ్రహారం, ఎస్కేబీఎమ్ హైస్కూల్ ప్రాంగణంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూస్కైస్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నజీనా బేగం మాట్లాడుతూ, గాలి కాలుష్యంతో ఊపిరి సంబంధిత వ్యాధులు తలెత్తుతున్నాయని, ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రమాదాల నుంచి విముక్తి పొందాలంటే విరివిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. వాతావరణ సమతుల్యాన్ని కాపాడి రానున్న తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని నజీనాబేగం కోరారు. అనంతరం స్వచ్ఛగాలి-నీలి ఆకాశాల కోసం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి రామారావు హజరై పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాజావలీ అధ్యక్షత వహించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం

బ్రహ్మదేవాలయం అనువంశక ధర్మకర్తగా రాజావాసిరెడ్డి ప్రమాణం



ధర్మకర్తగా ప్రమాణస్వీకారం చేస్తున్న రాజావాసిరెడ్డి సుధాస్వరూప్

చేబ్రోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీ చతుర్ముఖ బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం అనువంశిక ధర్మకర్తగా శనివారం రాజావాసిరెడ్డి సుధాస్వరూప్ బహదూర్ మన్నే సుల్తాన్ దొర ప్రమాణం చేశారు. 18వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చేబ్రోలులోని కోనేరు మధ్యలో శ్రీ చతుర్ముఖ బ్రహ్మదేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి తూర్పు పడమరన శివాలయాలు, ఉత్తర దక్షిణాన విష్ణు దేవాలయాలు, నాలుగు మూలలా అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. చతుర్ముఖ బ్రహ్మదేవాలయానికి రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడి వారసులే అనువంశక ధర్మకర్తలుగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శారదా దేవి రాజా వాసిరెడ్డి సుధాస్వరూప్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవో వినయ్‌కృష్ణ పాల్గొన్నారు.

బాపట్లలో గంటసేపు నిలిచిన శబరి ఎక్స్‌ప్రెస్



బాపట్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక లోపం కారణంగా శబరి ఎక్స్‌ప్రెస్ బాపట్లలో గంటసేపు నిలిచిపోయింది. శనివారం రాత్రి 7 గంటలకు బాపట్ల రైల్వేస్టేషన్‌కు చేరిన శబరిఎక్స్‌ప్రెస్ రైలులో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో రైలును అక్కడే నిలిపేశారు. లోపాలు సరిచేసి 8 గంటలకు రైలును పంపించారు. దీంతో రైలులోని ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైలు గంటసేపు నిలిచిపోవటంతో వారంతా స్టేషన్‌లోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. సాంకేతికలోపంతో తీవ్ర అసౌకర్యానికి గురైన ప్రయాణికులు గంటసేపు తర్వాత రైలు బయలుదేరటంతో ఊపిరిపీల్చుకున్నారు.

లంకెలకూరపాడులో విజిలెన్స్ దాడులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ మండలం లంకెలకూరపాడులోని శ్రీనివాస ట్రేడర్స్ ఎరువుల దుకాణంపై గుంటూరు రీజనల్ విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే చంద్రశేఖర్, విజిలెన్స్ వ్యవసాయ అధికారి ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలో తనిఖీ చేసి ఎరువుల భౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌లోని నిల్వలకు తేడాలను గుర్తించారు. అలాగే రికార్డులు అప్‌డేట్ కాకపోవటాన్ని గమనించారు. రూ. 69 లక్షల విలువైన సరుకు నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించి 32.8 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. లైసెన్స్ సస్పెండ్ కోసం కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. ఈ దాడుల్లో వ్యవసాయశాఖ అధికారులు రవిబాబు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుడిపై వైసీపీ రౌడీ మూకల దాడి



చికిత్స పొందుతున్న బత్తిన వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు

నకరికల్లు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నకరికల్లులో ఓ జనసేన కార్యకర్తపై వైసీపీ రౌడీ మూకలు రాడ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటన శనివారం జరిగింది. వైసీపీ మూకల దాడిలో గాయపడిన జనసేన కార్యకర్త వెంకటేశ్వర్లు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. నకరికల్లు పాతూరులో వేసీపీ కార్యకర్తలు వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. శనివారం విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తూ స్థానిక దేవాలయ ప్రాంగణంలో అసభ్యకరమైన పాటలు వేశారు. దీనిపై జనసేన కార్యకర్త వెంకటేశ్వర్లు అభ్యంతరం వ్యక్తం చేయగా రెచ్చిపోయిన వైసీపీ రౌడీమూకలు ఆయనపైన రాడ్లతోదాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ దాడిలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆయన్ను నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన్ను ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఆయనతో పాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు మిరియాల వెంకట సుబ్బమ్మ, జనసేన మండల అధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు, రాడ్ల శ్రీను, మేళ్ళాగు వెంకటేశ్వరరావు, శిరిగిరి శ్రీనివాసరావు, పలువురు జనసేన నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

నేటి మధ్యాహ్నం నుంచి
అమరేశ్వర ఆలయం మూసివేత

అమరావతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు అమరేశ్వర ఆలయాన్ని మూసివేస్తున్నట్లు దేవస్థాన సహాయ కమీషనర్ రేఖ తెలిపారు. సోమవారం 8 గంటల తర్వాత ఆలయ సంప్రోక్షణ చేసిన తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని ఆమె చెప్పారు.

9 నుంచి బీఈడీ కోర్సులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఏఎన్‌యూ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమై 12న ముగుస్తుందని ఏపీ ఎడ్‌సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ. ఏపీఎస్ స్వామి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునే ఓసీ, బీసీ అభ్యర్థులు రూ. 1200, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ కేటగిరీల అభ్యర్థులు రూ.600 చెల్లించాలని చెప్పారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు జరుగుతుందని, అనంతరం 13 నుంచి 15వ తేదీ మధ్య అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌ను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 16వ తేదీన వెబ్ ఆప్షన్స్ మార్పులకు అవకాశమిస్తామని చెప్పారు. అనంతరం ఈ నెల 18న సీట్ల కేటాయింపు జరుగుతుందని, అభ్యర్థులు 19, 20వ తేదీల్లో తమకు కేటాయించిన కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్‌సీసీ/సీఏపీ, ఇతర స్పెషల్ కేటగిరీల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 12న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో హాజరుకావాలని చెప్పారు. అభ్యర్థులు మరిన్ని వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని ఏపీఎస్ స్వామి సూచించారు.

కిట్స్‌కు వర్సిటీ స్థాయిలో మూడు అవార్డులు

● కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు



జేఎన్‌టీయూ వీసీ నుంచి అవార్డులను అందుకుంటున్న కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు


వట్టిచెరుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వింజనంపాడులోని కిట్స్ కళాశాలకు యూనివర్సిటీ స్థాయిలో మూడు విభాగాల్లో గుర్తింపు దక్కిందని కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ పీ బాబు వెల్లడించారు. యూనివర్సిటీ స్థాయిలో కిట్స్ కళాశాలకు బెస్ట్ స్టార్ ఆఫ్ కంపెనీస్ రిజిస్ట్రేషన్ అండ్ బెస్ట్ ఆఫ్ పేటెంట్స్ గ్రాంటే గుర్తింపు దక్కిందని ఆయన తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ 18వ వార్షికోత్సవంలో వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ చేతుల మీదుగా ఈ మూడు బహుమతులను అందుకున్నట్లు చెప్పారు. బెస్ట్ స్టార్ ఆఫ్ కంపెనీస్ రిజిస్ట్రేషన్, బెస్ట్ పేటెంట్స్ గ్రాంటేకి మూడు అవార్డులతో పాటు ఎస్‌బీఏ ఎలిజబుల్ బ్రాంచెస్‌కు అక్రిడిటేషన్ పొందినట్లు తెలిపారు. కిట్స్ కళాశాల తొలి నుంచి విద్యతో పాటు విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి పరుస్తోందని, వారు నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చెప్పారు. దానికి ఈ గుర్తింపు నిదర్శనమని డాక్టర్ పీ బాబు పేర్కొన్నారు.

స్టాక్ ట్రేడింగ్ పేరుతో ఉపాధ్యాయుడికి ఎర

● రూ. 64.50 లక్షలు దోచుకున్న సైబర్ కేటుగాళ్ళు

సత్తెనపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టాక్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి సత్తెనపల్లిలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుంచి సైబర్ కేటుగాళ్లు రూ. 64.50 లక్షలను దోచుకున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కట్టిబోయిన కోటేశ్వరరావు ఫోన్‌కు ఈ ఏడాది మార్చి 10వ తేదీన వాట్సాప్ గ్రూపు నుంచి ఒక లింకు వచ్చింది. ఆ లింకును కోటేశ్వరరావు ఓపెన్ చేయగా స్టాక్ మార్కెట్ నిమిత్తం డౌన్‌లోడ్ చేసుకోవాలని, స్టాక్ ట్రేడింగ్ చేసిన చాలా మందికి మంచి లాభాలు వచ్చాయని సైబర్ నేరగాళ్ళు ఆయన్ను గ్రూపులో పెట్టారు. లాభాలు వస్తాయన్న ఉద్దేశంతో కోటేశ్వరరావు జూలై 25 నుంచి 29వ తేదీ వరకు సైబర్ నేరగాళ్ల చెప్పిన విధంగా తన ఖాతా నుంచి పలు విడతలుగా రూ.65.50 లక్షలను వారి ఖాతాలకు మళ్లించారు. ఆ తరువాత నగదు రిఫండ్ కోసం కోటేశ్వరరావు వారికి మెసేజ్ పెట్టగా వాట్సాప్ గ్రూపులో విత్‌డ్రాకు ట్యాక్స్ కట్టాలని సమాచారమిచ్చారు. దాంతో అనుమానం వచ్చి కోటేశ్వరరావు వారి కార్యాలయం చిరునామా అడగ్గా ముంబైలో ఉందని చెప్పారు. వారు చెప్పిన కార్యాలయం చిరునామా గురించి కోటేశ్వరరావు వాకబు చేయగా అది నకిలీదని తేలింది. దాంతో తాను మోసపోయానని గ్రహించి శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తన భార్య ఖాతా నుంచి కూడా నగదును సైబర్ నేరగాళ్ళు చెప్పిన నెంబరుకు పంపానని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్ళ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ళు ఆన్‌లైన్‌లో ప్లే స్టోర్ ద్వారా షేర్ మార్కెట్ ట్రేడింగ్ యాప్ లాంటి లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని ప్రజలు దాన్ని గ్రహించి జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గణేశ్వర్ రెడ్డి(ఫైల్)

చేబ్రోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో మహిళకు గాయాలైన ఘటన చేబ్రోలు మండలం గరువుపాలెం సమీపంలో జరిగింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన ఆరుమళ్ళ గణేశ్వర్ రెడ్డి (58) కుటుంబంతో కొన్నేళ్లుగా తెనాలి మండలం సంగం జాగర్లమూడిలో నివాసం ఉంటున్నారు. గణేశ్వర్ రెడ్డి వడ్లమూడిలోనే ఓ సంస్థలో పనిచేస్తున్నారు. శనివారం ఆయన సంగంజాగర్లమూడి నుంచి వడ్లమూడికి ఆటోలో వస్తుండగా గరువుపాలెం వద్ద నారాకోడూరు నుంచి నిమ్మకాయల లోడుతో తెనాలి వెళుతున్న ట్రాలీ వాహనం వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. గణేశ్వర్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా మరో మహిళ గాయపడింది. ఆమె ను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు గణేశ్వర్ రెడ్డి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరనారాయణ వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నకరికల్లులో రాష్ట్ర స్థాయి ఆట్యా పాట్యా చాంపియన్‌షిప్

● పల్నాడు జిల్లా జట్లు నేడు ఎంపిక

నకరికల్లు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నకరికల్లులో రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆట్యా పాట్యా అసోసియేషన్ సెక్రటరీ ఉన్నం రోహిత్ జోయల్ శనివారం తెలిపారు. ఆదివారం స్థానిక వంగా వెంకటరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాస్థాయి పురుషుల, మహిళల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 25, 26 తేదీల్లో నకరికల్లులో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. సమాచారం కోసం ఫిజికల్ డైరెక్టర్లు సీహెచ్ పుల్లయ్య 98669 25108, జి.ఝాన్సీరాణి 994495 33234 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆత్మగౌరవ సమస్యపై నిరసన

సత్తెనపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆత్మగౌరవ సమస్యను పరిష్కరించాలని శనివారం మునిసిపల్ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. పట్టణంలోని అన్ని సచివాలయాల్లో మరుగు దొడ్ల సౌకర్యం కల్పించి.. మహిళా ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. చిలుకా ప్రతీప్, లక్ష్మి, రవి రాజు, కొండలరావు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై వినతి

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆటో కార్మికులు శనివారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు డిమాండ్ పడిపోయిందని తెలిపారు. ప్రభుత్వం సంవత్సరానికి రూ.25వేలు నగదు మంజూరు చేయాలని, గత ప్రభుత్వ హయాంలో విధించిన ట్యాక్స్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. సీపీఎం నాయకులు బి.సూరిబాబు, ఆటోల యజమానులు, డ్రైవర్‌లు పాల్గొన్నారు.

జాబ్‌చార్ట్ ప్రకటించాలి

మాచర్లటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగాలకు తగినట్లుగా జాబ్‌చార్ట్ ప్రకటించాలని పట్టణంలోని వార్డు సచివాలయ సిబ్బంది కోరారు. ఈ మేరకు శనివారం పురపాలక సంఘంలో మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబుకు వినతిపత్రం అందించారు. సర్వేల భారం, క్లస్టర్ మ్యాపింగ్, వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ల నుంచి తమను తప్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో అమర్, రఫీ, బాలశౌరి, మహేష్, అరుణ, సెల్వమణి, రాజేంద్ర, నాగమణి, ప్రసన్న, పద్మలత తదితరులు ఉన్నారు.

డాక్టర్ సుధీర్‌కు ఉద్యోగోన్నతి

గురజాలటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుధీర్ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ప్రమోషన్‌పై మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు బదిలీ అయ్యారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు

నకరికల్లు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. గ్రామ పంచాయతీల వారీగా జల్లాపేట తండాకు రూ.1,05,530, తురకపాలేనికి రూ.30,366, త్రిపురాపురానికి రూ.63,078, శివాపురం తండాకు రూ.70,685, రూపెనగుంట్లకు రూ.3,10,458, నకరికల్లుకు రూ.7,44,991, నరసింగపాడుకు రూ.1,32,082, కుంకలగుంటకు రూ.6,84,120, కండ్లకుంటకు రూ.3,94,620, గుండ్లపల్లికి రూ.7,02,177, దేచవరానికి రూ ,51,863, చేజర్లకు రూ.3,73,974, చీమలమర్రికి రూ.2,46,877, చల్లగుండ్లకు రూ.3,80,204, చాగల్లుకు రూ.1,67,393, బాలాజీ నగర్ తండాకు రూ 1,82,621, అడ్డరోడ్డుకు రూ.1,28,757లు నిధులు విడుదలయ్యాయని డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు తెలిపారు.

నకరికల్లులో రక్తదాన శిబిరం

నకరికల్లు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశాల మేరకు తహసీల్దార్ కె.పుల్లారావు, ఎంపీడీవో కె.సురేష్, ఏవో కె.దేవదాను, డీటీ టి.కొండారెడ్డిలు శిబిరాన్ని పర్యవేక్షించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన వారికి జిల్లా కలెక్టర్ జారీ చేసిన రక్తదాన ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

పాకాలపాడు పీఏసీఎస్‌కు 440 బస్తాల యూరియా

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాలపాడు పీఏసీఎస్‌కు 440 బస్తాల యూరియా (19.8 మెట్రిక్ టన్నులు) వచ్చినట్లు ఏఓ బి.సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. యూరియా నిల్వలను ఆయన పరిశీలించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు యూరియాను పంపిణీ చేశారు. పీఏసీఎస్ సీఈవో అన్నదాసు సాయిబాలు పాల్గొన్నారు.

మంచినీటి బోర్ల ఏర్పాటు

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వావిలాల నగర్, గ్రామంలోని ఎంపీపీఎస్(ఆర్ఎస్) పాఠశాలలో శనివారం వియత్నాంకు చెందిన బౌద్ధ భిక్షవుల ఆర్థిక సహకారంతో రెండు మంచినీటి బోర్లను ఏర్పాటు చేశారు. బోర్లను ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. బౌద్ధ భిక్షవుల సహకారంతో ఇప్పటి వరకు 15 బోర్లు వేసినట్లు డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సోలానంబీ, మాతంగి సాంబశివరావు, డీఐఈటీ షేక్ జాకీర్ హుస్సేన్, నాగ సాయి ప్రసాదు, రామకృష్ణ, చంద్రన్, ఉపాధ్యాయులు సుధీర్, ఆనందరావు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి వేడుకలు

దుర్గి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి గజ్జల శ్రీను ఆర్కెస్ట్రా భజన కార్యక్రమం నిర్వహించారు. లడ్డూ ప్రసాదంను జక్కా బాజిబాబు యాదవ్ రూ. 38 వేలు, కరెన్సీ నోట్లను జంగా సింహాద్రి రూ. 20,500లకు, వెనిగళ్ల నాగేశ్వరరావు రూ. 16,500లకు, కలశంను బొబ్బే సైదులు రూ. 5500లకు కైవసం చేసుకున్నారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాసవీ సేవా అన్న ప్రసాద్ కమిటి ఆధ్వర్యాన శనివారం కారంపూడిలో 300 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. షేక్ నాసరబుజ్జి సతీమణి జైతున్‌బి జ్ఞాపకార్థం కుమారుడు ఎస్కే వలి, బుజ్జి, కేకేవీ కార్ ట్రావెల్స్ కుటుంబ సభ్యులు ఈ అన్నదానంకు సహకారం అందించారు.

సచివాలయ సిబ్బంది నిరసన

పిడుగురాళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ పరిధిలో ఇంటింటి హౌస్ మ్యాపింగ్, మనమిత్ర యాప్ ఉపయోగాలను వివరిస్తూ ప్రతి ఇంటికి ఒక పథకాన్ని అందించేలా మనమిత్ర యాప్ ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం ఆదేశించడంపై సచివాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట సచివాలయ సిబ్బంది నిరసన

ప్రజల దాహార్తిని తీర్చడమే సీఎం లక్ష్యం

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పెట్టుకుని సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని జెట్టిపాలెంలో జలజీవన్ మిషన్ నిధుల రూ.50లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులకు భూమిపూజ చేశారు. రెంటచింతల మండలానికి రూ.60కోట్ల నిధులు విడులయ్యాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. వచ్చే ఏడాదికల్లా పనులన్నీ పూర్తిచేస్తానని ఆయన ప్రకటించారు.

దేవుడు సొమ్ము కాజేసిన ఏ ఒక్కరినీ వదలం

దేవుడి సొమ్ము కాజేసిన ఏ ఒక్కరినీ వదిలేది లేదని.. దైవంతో పెట్టుకున్నోళ్లు సర్వనాశనం కావడం తథ్యమని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం సత్రశాల ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈవో గాదే రామిరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాచర్లలోని పలు ఆలయాల భూమిని స్వాహా చేశారని, విచారణ పూర్తికాగానే వారు కటకటాల పాలు కాకతప్పదని హెచ్చరించారు. అడిగొప్పుల అమ్మవారి ఆలయ సుందరీకరణకు రూ.4.50కోట్లు కేటాయించామన్నారు. ఆలయ అభివృద్ధి ఛైర్మన్ గుండా వెంకటశివయ్యతోపాటు సభ్యులు కృషి చేస్తే ప్రభుత్వపరంగా తాను నిధులు వచ్చేలా చూస్తానన్నారు. తొలుత ఎమ్మెల్యేకు వేదపండితుల పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో శిల్పారామం ఛైర్మన్ మంజులారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కాశిరెడ్డి, ఏఈలు, సెక్రటరీ శౌరీ కుమారి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లీలావతి, డీసీ ఛైర్మన్ నరసింహారావు, టీడీపీ నాయకులు అబ్బిరెడ్డి, కుర్రి శివారెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శౌర్రెడ్డి, రాయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు 108 అంబులెన్స్

మాచర్ల రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రభుత్వవైద్యశాలలో అంబులెన్స్‌ల కొరతపై ఈ నెల 4న ఆంధ్రజ్యోతిలో 108కు సుస్తీ శీర్షికన ప్రచురిత కథనానికి స్పందన లభించింది. ప్రభుత్వ వైద్యశాలకు నూతనంగా 108 అంబులెన్స్ మంజూరైంది. ఈ వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి, వైద్యులు ఉదయభాను, రేవతి, మురళి, లావణ్య, రాణి, వంశీ, వివేక్, హెడ్ నర్సు ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల అగచాట్లు



రైతులను సముదాయిస్తున్న ఎస్సై సోమేశ్వరరావు

ముప్పాళ్ల,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్లలోని సొసైటీ వద్ద రైతులు యూరియా కోసం శనివారం ఎగబడ్డారు. ఒకరినొకరు నెట్టుకుంటూ దుర్భాలాడుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సొసైటీ వద్దకు వెళ్లి రైతులను సముదాయించి పంపిణీ సక్రమంగా జరిగేలా చూశారు. సొసైటీకి 440 బస్తాల యూరియా రావడంతో.. రైతులు ఎగబడ్డారు. రోడ్డు పై ఎండలో బారులు తిరి యూరియా అందదనే ఉద్దేశంతో ఒకరినొకరు నెట్టుకుంటూ దుర్భాషలాడుకున్నారు. పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. సత్తెనపల్లి ఏడీఏ రవిబాబు, తహశీల్దార్ నగేష్, ఏఓ ఎస్ శ్రీధర్ రెడ్డిరైతులు ఎండలో నిలబడకుండా ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలంలో షామియానా, కుర్చీలు, తాగేందుకు మంచినీరు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పార్టీలకు అతీతంగా..

● ఏడాదిలో రెండున్నర కోట్లకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్

● 253 మందికి ప్రయోజనం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని (ఫైల్)

పిడుగురాళ్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ఏడాది కాలంలో గురజాల నియోజకవర్గంలో 253 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ అందింది. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సిఫార్స్ మేరకు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో అనారోగ్యం బారినపడి చికిత్స పొందినవారికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఒక్కొక్కరికి 4 లక్షల రూపాయలకు పైగా మంజూరైన వారు పిడుగురాళ్ల, గురజాల మండలాల్లో వున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గురజాల నియోజకవర్గంలో గత ఆగస్టు నెలాఖరు వరకు 8 దఫాలుగా 253 మందికి 2 కోట్ల 69 లక్షల 356 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే యరపతినేని అందించారు. ఇందులో పార్టీలకు అతీతంగా వైసీపీకి చెందిన వారికి సుమారు 4 లక్షలకు పైగా చెక్కులు అందించడం జరిగింది. అనారోగ్యంతో వున్నవారు ఏ పార్టీకి చెందిన వారనేది చూడకుండా గురజాల నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే మేలని భావిస్తూ తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుచేసేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. గత నెలలో పిడుగురాళ్లలోని 2వ వార్డుకు చెందిన వైసీపీ నేత సైదారావు తల్లి నల్లమేకల గురవమ్మకు 4లక్షలు, కరాలపాడు మాజీ సర్పంచ్, వైసీపీ నేత ముడేల అంబిరెడ్డికి 2 లక్షలకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి చెక్కులు అందజేశారు.

పాము కాటుకు మహిళ మృతి

బెల్లంకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో శనివారం జరిగింది. జి.లలిత(45) ఉదయాన్నే చిక్కుడు పొలంలో కలుపు తీస్తుండగా వెనుక ఉన్న పాము కాటు వేసింది. అది గమనించిన స్థానికులు చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

నేడు శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం మూసివేత

దుర్గి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 5 గంటలకు సంప్రోక్షణ చేసిన తర్వాత తిరిగి అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావిస్తామన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం

బెల్లంకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ ప్రవీణ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, బద్దూరి వీరారెడ్డి, సుబ్బారెడ్డి, బుల్లోడు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లక్ష్మీదేవి

లక్ష్మీదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

దుర్గి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకురాలు పగడాల లక్ష్మీదేవి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ వేణు, సిబ్బంది, విద్యార్థులు ఆమెను అభినందించారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోండి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని పిడుగురాళ్ల జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గార్లపాటి అనసూర్య అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ పథకాలను అర్హులకు పక్షపాతం లేకుండా అందించాలని ఎంపీపీ అధికారులను కోరారు. . ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాసాగర్, ఉప ఎంపీపీ సాతులూరి బాబు పాల్గొన్నారు.

నేత్రదానంతో.. మరొకరి జీవితాల్లో వెలుగులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ విద్య

పెదకూరపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మరణానంతరం నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరికి కంటి చూపు కల్పించవచ్చని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ విద్య అన్నారు. జనచైతన్య సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. డాక్టర్ రూపా ప్రియదర్శిని, సమితి కో-ఆర్డినేటర్ తుళ్ళూరి సాంబశివరావు, అనీల్ కుమార్, షేక్ లియాకత్ ఆలీ పాల్గొన్నారు.

రూ.35 లక్షల మాడుగుల పంచాయతీ నిధులు గోల్‌మాల్?

● దొంగ బిల్లులతో డబ్బులు పంచుకున్న అధికారులు

గురజాలటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడుగుల గ్రామ సచివాలయ పంచాయతీ నిధులు సుమారు రూ. 35 లక్షలు గోల్‌మాలైనట్లు సమాచారం. దొంగ బిల్లులు పెట్టుకొని నగదు విత్‌డ్రా చేసుకొని అధికారులు పంచుకున్నట్లు తెలుస్తోంది. నిధులు గోల్‌మాల్ చేసిన వారిలో ఓ అధికారి దాచేపల్లి మండలంలో ఒక గ్రామ సచివాలయంలో రూ.లక్షల్లో పంచాయతీ నిధులు గోల్‌మాల్ చేసినట్లు నిర్ధారణ జరిగి గతంలో సస్పెండయ్యారు. వైసీపీ నేతల అండదండలతో.. మళ్లీ ఉద్యోగంలో చేరారు. ఒకసారి సస్పెండ్ చేసినా అతనిలో మార్పు రాలేదని తోటి అధికారులు అంటున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మాడుగుల గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్ఎస్కేల్లో సిద్ధంగా యూరియా

పెదకూరపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్సాపురం, లగడపాడు రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని ఏఓ బి.కృష్ణయ్య శనివారం తెలిపారు. రైతులు ఆధార్ , పట్టా దారు పాసు పుస్తకం, ఫోన్ నెంబరుతో సంప్రదించాలని తెలిపారు.

అయోధ్య స్వామి ఆశ్రమంలో పూజలు

పెదకూరపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు అయోధ్య స్వామి ఆశ్రమంలో అనంత పద్మనాభ స్వామి కల్యాణ వ్రతాన్ని శనివారం నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాటి కోటేశ్వరమ్మ, రామకృష్ణ, స్వతంత్ర భారతి, సుబ్బారావు, అంకారావు పాల్గొన్నారు.

ఇంకెంతకాలం సాగదీస్తారు?

● రెండేళ్ల నుంచి కొనసాగుతున్న రోడ్డు పనులు



నడికూడి రైల్వే స్టేషన్ మార్గంలో నిర్మాణంలో ఉన్న తారు రోడ్డు

దాచేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల నుంచి నగరపంచాయతీలో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. 2023లో రూ.2 కోట్లతో దాచేపల్లి నగర పంచాయతీలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి నడికూడి సచివాలయం-3 వరకు రోడ్డు విస్తరణ, తారు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా.. కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు మందకొడిగా జరుపుతున్నారు. ఇంకెంత కాలం పనులు సాగతీత చేస్తారోనని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. నిత్యం రైల్వే ప్రయాణికులు, ఆస్పత్రులకు వచ్చే రోగులు, విద్యార్థులు ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వేగంగా ప్రయాణం చేస్తున్న వాహనాలు టైర్ల కింద పడి గులకరాళ్లు ఎగిరిపడుతున్నాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నడికూడి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన మంచి నీటి పైపులను తొలగించారు. దీంతో స్థానికులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీటితోనే ఇంటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ఇప్పటికైనా స్థానికులు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హస్త కళాకారులకు సెమినార్

విజయపురిసౌత్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాత సరోవర్ ఫంక్షన్ హాలులో శనివారం డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్స్ సహకారంతో ఆపిటికో ఆధ్వర్యాన హస్త కళాకారులకు సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హస్త కళ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ హస్త కళాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సుధీర్‌కుమార్, కొత్తూరు, దాచేపల్లి, తాళ్లపల్లికి చెందిన కళాకారులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న అపర్ణలక్ష్మి

నిరు పేదలకు వరం సీఎం సహాయ నిధి



సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు/ బెల్లంకొండ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరు పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజక వర్గ క్యాంపు కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నియోజక వర్గంలో 159 మందికి మంజూరైన రూ 1,18,72,000 చెక్కులను పంపిణీ చేశారు. బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెం గ్రామానికి చెందిన భిక్షాలు కుటుంబ సభ్యులకు రూ 1.70 లక్షలు, మారబోయిన దుర్గా ప్రసాదుకు రూ.43వేలు, కొండబోయిన నరసింహారావుకు రూ.53వేలు, మున్నంగి సత్యానారాయణకు రూ.80వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ

క్రోసూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన ముగ్గురికి శనివారం ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మక్కెన ఈశ్వరమ్మకు రూ.1.20 లక్షలు, మూలగుండ్ల వెంకాయమ్మకు రూ.40వేలు, విప్పల పిచ్చిరెడ్డికి రూ.60వేలు చెక్కులను గుంటూరులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు. టీడీపీ నాయకులు కె.నరసింహారావు, నేలవల్లి భూపతిరావు, గంగాధర్, ఖాశీప్రసాదు, రమేష్ పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) ఈ నెల 22 నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో జరిగే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను శనివారం స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆవిష్కరించారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ, నరుకుళ్లపాడు పీఏసీఎస్ ఛైర్మన్ భాష్యం జగదీష్, అర్చకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు/రాజుపాలెం/క్రోసూరు సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో టి. శ్రీలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకరికల్లు మండలం కుంకులగుంట శివారు పాపిశెట్టిపాలెంలో బీసీ(బి), సహాయకుల పోస్టులకు.. మండలంలోని చీమలమర్రి- 4లో ఎస్సీ రూపెన గుంట్ల - 4లో బీసీ(ఎ), నకరికల్లు ఎస్సీ -2లో ఎస్సీ, గుండ్లపల్లి ఎస్సీ - 2లో ఎస్సీ, జల్లాపేటలో దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన స్థానిక మహిళలు దరఖాస్తులు ఈ నెల 8 నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటలు లోగా సత్తెనపల్లిలోని సమగ్ర శిశు అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. అలాగే రాజుపాలెం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం సహకురాలి (ఎస్సీ)గా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ తెలిపారు.

● క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాల్లోని అంగన్ వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాజెక్టు సీడీపీవో వెంకటరమణ వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులు అమరావతి మండలంలోని మునగోడు - 2 సెంటరులో రెండు, 3 సెంటర్‌లో ఒక పోస్టు ఉన్నాయన్నారు. బెల్లంకొండ మండలంలోని మన్నె సుల్తాన్‌పాలెంలో ఒక పోస్టు ఉందన్నారు. అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు అమరావతి మండలంలో ఐదు, బెల్లంకొండ మండలంలో రెండు, క్రోసూరు మండలంలో రెండు, పెదకూరపాడు మండలంలో ఆరు ఉన్నాయన్నారు.

రెండు రోజుల్లో పుష్కలంగా యూరియా నిల్వలు

● ఏడీఏ పి.మస్తానమ్మ

క్రోసూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రోసూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని 4 మండలాల్లో రెండురోజుల్లో పుష్కలంగా యూరియా నిల్వలు సమకూరుతాయని క్రోసూరు ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. శనివారం ఆమె క్రోసూరు సొసైటీలో యూరియా పంపిణీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గిడ్డంగిలోని యూరియా నిల్వలను పరిశీలించారు. క్రోసూరు మండలం మొత్తం ఇప్పటివరకు 633 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు చెప్పారు. సబ్‌డివిజన్‌లోని అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, బెల్లంకొండ మండలాల్లో సుమారు 2వేల మెట్రిక్‌టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. మంగళవారం నాటికి రైతు సేవా కేంద్రాలకు పూర్తిస్థాయిలో యూరియా నిల్వలు వస్తాయని వెల్లడించారు.

పిన్నెల్లిలో అవెన్యూ ప్లాంటేషన్

మాచవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి గ్రామంలో శనివారం అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్సీ కాలనీ నుంచి ఎస్టీ కాలనీ వరకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచనలతో కార్డ్ సంస్థ బాలబాట గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం సంయుక్త ఆధ్వర్యంలో అవెన్యూ ప్లాంటేషన్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం జరిగిందని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. కార్డ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమరనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఏపీవో కోటిరెడ్డి, టీడీపీ దస్తగిరి, రామిరెడ్డి, సుభానీ, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పొలాలు ఆక్రమిస్తూ..అరాచకం సృష్టిస్తున్నాడు

● ఎమ్మెల్యేకు కోనూరు రైతుల ఫిర్యాదు

అచ్చంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన శాఖమూరి శ్రీనివాస్ అనే వ్యక్తి కొంత కాలంగా రైతుల పొలాలను ఆక్రమించుకుంటూ డాక్యుమెంట్లను తారుమారు చేస్తున్నాడని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోనూరు గ్రామ రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్‌కు ఫిర్యాదు పత్రాలను అందజేశారు. గ్రామస్తులపై అరాచకాలకు పాల్పడుతున్న శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో పసుపులేటి వసంతరావు, జనార్దన్‌రావు, గుంటుపల్లి సాంబయ్య, మోహనరావు, శ్రీనివాసరావు, జూపల్లి శివ నాగరాజు, గంగాధర్, సరోజిని, కోటేశ్వరమ్మ ఉన్నారు.

ఉత్సాహంగా నిమజ్జనోత్సవాలు

అచ్చంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం గణపతి నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకునికి పూజలు చేసి శనివారం ఘనంగా నిమజ్జనానికి తరలించారు. చిగురుపాడులో గణనాథుడిని భారీ సెట్టింగ్‌లతో నిమజ్జనానికి తరలించారు.

● అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అమరావతి, గుంటూరు, దుగ్గిరాల తెనాలి పట్టణాలలోని సత్యసాయి బాబా మందిరాలలో వినాయక చవితి పూజలు అందుకున్న గణనాధుల విగ్రహాలను శనివారం సాయంత్రం స్థానిక త్రిశక్తి పీఠం వద్ద కు తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. అనంతరము పవిత్ర కృష్ణానదిలో 6విగ్రహాలను నిమజ్జనం చేయడం జరిగింది. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు జెట్టి రోశారావు, చేకూరి జాజిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ రోడ్డు ప్రమాదంలో.. మాదల యువకుడి మృతి



కొడవటి నరేష్ (ఫైల్ ఫొటో)

ముప్పాళ్ళ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని మాదల గ్రామానికి చెందిన కొడవటి నరేష్(17) మృతిచెందాడు. స్నేహితులతో కలసి కారులో టూరుకు వెళ్తుండగా వారి వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా నరేష్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరొకరు కూడా ఉన్నారు. నరేష్ ప్రమాదంలో మృతి చెందారని అక్కడి పోలీసులు తల్లిదండ్రులు కొడవటి సుబ్బారావు, మరియమ్మకు సమాచారం ఇచ్చారు. నరేష్ అక్కడ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆరోగ్యానికి భరోసా



● రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీతో రూ. 25 లక్షల వరకు బీమా వర్తింపు
● 3,257 వ్యాధులకు చికిత్స ● పేదలకు వరంగా తాజా పాలసీ

సత్తెనపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా దక్కనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభు త్వం ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా రూ 2.50 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వా రా రూ.5 లక్షలు పేదల వైద్య ఖర్చులకు అందిస్తు న్నాయి. ఒక్కో కుటుంబం ఒక ఏడాదికి వైద్య సేవలు తీసుకొనేందుకు ఈ పథకాలు అమల్లో ఉన్నాయి. ఇప్పుడు ఇంతకు మించి రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముందుకు వచ్చింది. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలన్నీ దారిద్రరేఖకు దిగు వున ఉన్న కుటుంబాలకు మాత్రమే అందేది. ఇది కూడా కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే చికిత్స లు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలో అన్ని రకాల చికిత్సలు ఉన్నాయి. వర్కింగ్ జర్నలిస్టులను ఇందులో చేర్చారు. అన్ని వర్గాలకు హెల్త్ పాలసీని వర్తింపజేస్తారు.

కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్ళలేక ప్రభుత్వాసుపత్రులో వ్యాధి నయమవుతుందో లేదో నమ్మకం లేక చాలా మంది సతమత మవు తున్నారు. అయితే తాజాగా రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీతో ఇలాంటి వారి కష్టాలన్నీ తీరనున్నాయి. ఈ పాలసీతో పేద, మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రి మెట్లెక్కేందుకు అవకాశం కలగనుంది. ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా వర్తించేలా గురువారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది. ఈ సొమ్ము తో 3,257 చికిత్సలు ఉచితంగా పొందేదుకు అవకాశం కలుగుతుంది.

ఆరు గంటల్లోనే వర్తింపు

సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళితే డాక్టర్ ఫీజు, మందులు, రక్త పరీక్షలతో కనీసం రూ.5వేలయినా ఖర్చవుతుంది. ఇక ఆపరేషన్‌లకయితే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఆస్పత్రిలో ఉండేందుకు గదికి రూ 3.వేల నుంచి రూ 10వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ వసతులున్న ఆస్పత్రుల్లో అయితే మరింత అధికంగా వసూలు చేస్తున్నారు. ఆరోగ్య పరీక్షలకు రూ. 5 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చవుతున్నాయి. వ్యాధి నిర్ధారణ తరువాతయ్యే ఖర్చు గురించి ఇక చెప్పలేం. కుటుంబానికి జీవనాధారమైన ఇంటి పెద్ద అర్ధాంతరంగా మంచం పట్టడమో, ప్రాణాలు కోల్పోవటమో జరిగితే ఆ కుటుంబం వీధిన పడుతుంది. వైద్య ఖర్చులకే లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేక పేద, మధ్య తరగతి ప్రజలు చితికిపోతున్నారు. ఇప్పుడు ప్రతి పది మందిలో ముగ్గురు షుగర్, బీపీ వ్యాధితో బాధపడుతున్నారు. రెండు వ్యాధులున్న వారు వివిధ రకాల పరీక్షలు చేయించుకోవాలి. లేదంటే పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధుల భారిన పడుతున్నారు. గుండెపోటు కు గురవుతున్నారు. ప్రతి గ్రామంలో క్యాన్సర్ బాధితులు కూ డా ఉన్నారు. వీటి చికిత్సకు లక్షల్లో ఖర్చవుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు కావటంతో చికిత్సకు మందులు వాడాల్సి వస్తుంది. సంపాదించిన దానిలో సగం ఆస్పత్రులకు పోస్తున్నారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు ప్రభుత్వం అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు రూ. 25 లక్షల బీమాను వర్తింపజేస్తోంది. ఆస్ప త్రిలో చేరిన ఆరు గంటల్లోపే హెల్త్ పాలసీ అమల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పాలసీ అమలు చేయటం ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య భరోసా లభించనుంది.



న్యాయ శాస్త్రంలో బంగారం



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా విశాఖలో బంగారు పతకాలను అందుకుంటున్న తెనాలి విద్యార్థి శ్రీరామ్

అద్భుత ప్రతిభతో 9 బంగారు పతకాలు కైవసం చేసుకున్న తెనాలి యువకుడు శ్రీరామ్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి స్వీకరణ

తెనాలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): న్యాయ శాస్త్రంలో విశేష ప్రతిభ చూపి తెనాలికి చెందిన శ్రీరామ్ అనే యువకుడు 9 బంగారు పతకాలను సాధించి అరుదైన రికార్డు సృష్టించారు. ఆ పతకాలను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా ఆయన అందున్నారు. తెనాలికి చెందిన భాగవతుల నాగసాయి శ్రీరామ్ విశాఖప ట్నంలోని దామోదరం సంజీవయ్య జాతీయ లా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసిస్తున్నారు. ఎల్ఎల్ఎంలో క్రిమినల్ అండ్ సెక్యూరిటీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. దీంతోపాటే మరో 8 విభాగాల్లో ప్రతిభ చూపి మొత్తం 9 బంగారు పతకాలను దక్కించుకున్నారు. శుక్రవారం విశాఖలోని విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంతో రాష్ట హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా శ్రీరామ్ ఈ పతకాలను అందుకున్నారు. 9 పతకాలు ఒకేసారి సాధించి అరుదైన రికార్డు సాధించటంతో పలువురు ప్రముఖులు శ్రీరామ్‌ను అభినందించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం శ్రీరామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు దుర్గాప్రసాద్, లలిత శారదకు ఆలపాటి అభినందనలు తెలిపారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ తరఫున కిరణ్‌కుమార్, మూర్తి వెంకటేశ్వరరావు, తదితరులు శ్రీరామ్‌కు, ఆయన కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్లక్ష్యమే.. శాపం

(5వ పేజీ తరువాయి)

ఏవీ చేపట్టిన దాఖలాలు లేవు.

జూలైలో 10 మంది మృతి

మరణాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లం అవుతుంది. ఈ ఏడాది జూలైలో తురకపాలెం గ్రామానికి చెందిన 10 మంది వరుసగా మరణించారు. వారిలో అన్ని వయసుల వారు ఉన్నారు. పొలంపల్లి వెంకటేశ్వర్లు(52) గుంటూరు ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మేల్కొన్నా కొన్ని ప్రాణాలు దక్కి ఉండేవి అన్న వాదన స్థానికంగా వినిపిస్తుంది. గ్రామానికి చెందిన మరణ నివేదిక ప్రతీ నెల చివరిలో ఆరోగ్య కార్యకర్తలు జిల్లా కార్యాలయానికి పంపుతారు. కేవలం 2300 మంది జనాభా ఉన్న చిన్న గ్రామంలో ఒకే నెలలో 10 మంది మరణిస్తే అక్కడ అసాధారణ పరిస్థితి ఉన్నట్లు భావించాలి. అయినా ఏ అధికారి కూడా ఈవిషయం పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు.

ఆగస్టులోనూ మరణ మృదంగమే..

ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం తురకపాలేనికి శాపంగా మారినట్లు కనిపిస్తుంది. జూలైలో అధిక సంఖ్యలో మరణాలు సంభవించిన తర్వాత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి అందరికీ పరీక్షలు నిర్వహిస్తే పెను ప్రమాదం తప్పి ఉండేది. అటువంటి చర్యలు చేపట్టక పోవడంతో ఆగస్టులో కూడా గ్రామానికి చెందిన 10 మంది మరణించారు. సెప్టెంబరు నెల మరణాలకు సంబంధించిన వివరాలు అధికారులు ఇంకా బయటకు వెల్లడించలేదు.

ఫోన్ చేసినా పట్టించుకోలేదు..

తురకపాలెంలో వరుస మరణాలు సంభవిస్తున్న విషయాన్ని కొందరు ప్రజాప్రతినిధులు ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తుంది. జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి కూడా ఫోన్‌లో పరిస్థితిని వివరించినట్లు సమాచారం. అయినా ముఖ్య అధికారులు పెద్దగా స్పందించలేదన్న ఆరోపణలున్నాయి. చివరికి అదే ప్రజాప్రతినిధులు విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. సుమారు 29 మంది మరణించిన తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ మేల్కొందన్న విమర్శలున్నాయి.

రక్తనమూనాలకు తెనాలిలో పరీక్షలు

తురకపాలెంలో 2500 మందికి సంబంధించిన రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించేందుకు వైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో శనివారం వెయ్యి మంది నుంచి రక్తనమూనాలు సేకరించగా వాటిలో 189 మంది రక్త నమూనాలను తెనాలి జిల్లా వైద్యశాలకు పరీక్షల నిమిత్తం తరలించారు. కొన్నింటిని గుంటూరు సర్వజన ఆస్పత్రికి, మరికొన్ని నమూనాలను విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. వీటిని పరీక్షించి ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో శనివారం రాత్రి వరకు పరీక్షలు చేపట్టారు. ఇందుకోసం 8 మంది పాథాలజీ నిపుణులు, ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి రంగారావు తెలిపారు. ఆదివారం కూడా మరికొన్ని నమూనాలు తెనాలి వైద్యశాలకు రానున్నాయన్నారు. ఒక్కొక్క రక్త నమూనా నుంచి కంప్లీట్ బ్లడ్ కౌంట్, జీవ రసాయన పరీక్ష, లివర్ ఫంక్షన్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా మరణాల గుట్టును గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్, ప్రత్యేక అధికారి డాక్టర్ మజీదా తెలిపారు.

తింటే.. తంటా

(5వ పేజీ తరువాయి)

చిక్కీలు, లడ్డూలు, రాగులు, జొన్నలు, సజ్జలుతో తయారుచేసే పదార్థాలు ఇవ్వాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రత్యేకంగా సూచిస్తోంది. 14 ఏళ్ల లోపు పిల్లలకు ఇచ్చే ఆహారంలో కార్బోహైడ్రేట్లు ఉండాలి. ఉడికించిన ఆహార పదార్థాలు ఇవ్వాలి. పాలు, గుడ్లు తోపాటు రెండు రోజులకు ఒకసారి మాంసాహారాన్ని అందించాలి. ఆయా పదార్థాల్లో అధిక ఉప్పు, కారం, నూనె లేకుండా చూడాలి.

ఆలకించరు.. పట్టించుకోరు

మద్యపానం, ధూమపానంతో పాటు జంక్‌ఫుడ్‌తో ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నాయి. జంక్‌ఫుడ్ నుంచి పిల్లలను రక్షించాలంటూ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల్ని జారీ చేసింది. పాఠశాలలకు, వసతిగృహాలకు 50 మీటర్లు వరకు చిరుతిళ్ల దుకాణాలపై నిషేధించారు. దుకాణాల్లో అమ్మే చిరుతిళ్లపై అధికారులు తనిఖీలు చేయాలి. క్యాంటీన్‌లలో మిఠాయిలు, ఫ్రెంచ్‌ఫ్రైస్, బర్గర్లు, చిప్స్, పిజ్జా, సమోసాలు, నూడిల్స్, శీతలపానీయాలు పూర్తిగా నిషేధించింది. అయితే ఆ నిబంధనల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇక ప్రభుత్వ హెచ్చరికల్ని ఎవరూ ఆలకించడంలేదు. జంక్‌ఫుడ్‌లలో అతి ప్రమాదకరంగా ఉండే రసాయనాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ 2016లో నిషేధించింది. కానీ అవి జంక్‌ఫుడ్ తయారీదారులు వాటిని వాడుతూనే ఉంటారు. రుచి, ఫ్లేవర్, కలర్స్ అధిక తీపి కోసం వాడుతుంటారు. నిషేధిత ప్రోఫైల్‌గానెట్, పోటాషియం బ్రిమెట్, మోనోసోడియం గ్లూటామెట్, డైఏసిటల్‌తో పాటు అధిక తీపిని ఇచ్చే హై ఫ్రక్టోజ్‌కార్నసిరప్ వంటి రసాయనాలను జంక్‌ఫుడ్ తయారీదారులు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఈ రసాయనాల వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు తలెత్తున్నాయని దీనిపై నిషేధించారు. అయితే వీటిని అటు తయారీదారులు.. ఇటు వ్యవస్థలు పట్టించుకోవడంలేదు. దీంతో మార్కెట్‌లో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి.

తల్లిదండ్రులదే బాధ్యత..

ఆరోగ్యంపై ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయనుకోవడం అపోహే అవుతుంది. అన్నిచోట్ల అందుబాటులో ఉంటున్న జంక్‌ఫుడ్ నుంచి నుంచి పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. వారికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచే బాధ్యత కూడా పెద్దలదే. సొంతంగా తయారు చేసుకునే ఆహారం నిల్వ ఉన్నా అది అంతగా శరీరంపై ప్రభావం చూపదు. కానీ జంక్‌ఫుడ్ శరీరంలోనే పేరుకుపోయి నాడీ, జీర్ణవ్యవస్థ, మెదడు, గుండెతో పాటు 18 రకాల అవయువాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. జంక్‌ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లల ప్రవర్తన కూడా వింతగా ఉంటుంది. విపరీత మనస్తత్వంతోపాటు, చిన్న చిన్న కారణాలకు ఆవేదన చెందుతూ ఆత్మహత్యల వైపు వెళ్తూ ఉంటారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించండి

● జ్వరపీడితులకు సత్వరమే చికిత్స
● పిడుగురాళ్లలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో జ్వరపీడితులను గుర్తించేందుకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌ఓ రవి ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పిడుగురాళ్లలో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు అనే కథనానికి స్పందించిన అధికారులు శనివారం పట్టణంలో పలు వార్డులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు. ఎంపీడీఓ కార్యాలయం పరిసర ప్రాంతాలు, ప్రజాశక్తి నగర్‌తో పాటు గత ఏడాది లెనిన్‌నగర్‌లో అతిసార వ్యాధులకు గురైన పలు ప్రాం తాలకు వెళ్లి తనిఖీలు చేశారు. కొన్ని గృహాల ముందు డ్రమ్ములలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి ఇంటి యజమానులకు తగు సూచనలు చేశారు. డ్రమ్ములలో నీటిని నిల్వ ఉంచకూడదని తెలుపుతూ వాటిని కింద పడబోశారు. లెనిన్‌నగర్‌లోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. గతేడాది జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. నీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు దరిచేరకుండా ఉండేందుకు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సబ్‌యూనిట్ అధికారి మహ మ్మద్ గౌస్, మారుతీనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నస్రీన్, సూపర్‌వైజర్ ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మమతానుబంధం ఉండాలి

● డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో ఉపాధ్యాయులకు మమతానుబంధం ఉండాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లావు రత్తయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏ రంగంలోనూ లేని, ఉపాధ్యాయులకు మాత్రమే ఉన్న అతి గొప్ప అవకాశం సాధ్యమైనంత మంది శిష్యులను పొందడమేనని వెల్లడించారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ వర్తమాన సమస్యలను అధిగమించటమే కాకుండా, భవి ష్యత్ తరానికి పునాది వేసే భాగ్యం ఉపాధ్యాయులుగా మనకు మాత్రమే కలిగిందన్నారు. కార్యక్రమంలో సీఈవో మేఘన కూరపాటి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డీ.విజయరాము తదితరు లు అధ్యాపకులను సత్కరించారు.



అధ్యాపకులను సత్కరిస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలకు డీఈవో అభినందనలు



ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈవో సీవీ రేణుక

గుంటూరు (విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన శారదానికేతన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యా యిని పి.సునీత రజిని, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పి.లక్ష్మీప్రసన్న కుమారిలను డీఈవో సీవీ రేణుక శనివారం కార్యాలయంలో అభినందించారు ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచినందుకు, గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో అత్యున్నత స్థానం సంపాదించినందుకు వారికి అభి నందనలు తెలియజేశారు. అవార్డు పొందడం బాధ్యతను మరింత పెంచిందని ఈ సంద ర్భంగా వారు అన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నగ్రా ఉషాకుమారి ఉపాధ్యాయుల, సేవా సంస్థల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడంపై వారిని అభినందించారు కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి శ్రీఎండీ ఖాసిం పాల్గొన్నారు

పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాలకు వక్రభాష్యం

● డోర్‌టూడోర్ స్మార్ట్‌రైస్ కార్డుల పంపిణీ చేయని సెక్రటరీలు
● రేషన్ షాపుల వద్ద కూర్చుని అక్కడికే రమ్మని సమాచారం
● డిపోల వద్ద కుప్పలు తెప్పలుగా కార్డులు
● బద్దకిస్తున్న సెక్రటరీలపై చర్యలకు సిఫార్సు చేయకుండా వత్తాసు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ జారీ చేసిన ఆదేశా లకు జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు, పౌర సరఫరాల అధికారులు వక్రభాష్యం చెబుతున్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లి సెక్రెటరీలు పంపిణీ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేయగా వాటిని లెక్క చేయడం లేదు. ఏ రేషన్ దుకాణంతో అయితే సెక్రెటరీలను మ్యాపింగ్ చేశారో అక్కడికి వెళ్లి కూర్చుంటున్నారు. ఆ షాపులో రేషన్ తీసుకోవ డానికి వచ్చిన వాళ్లకు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఈ కారణంగా జిల్లాలో రైస్‌కార్డుల పంపిణీ 20 శాతంలోపే ఉంది. ఈ విషయంపై అటు పౌరసరఫరాల అధికారలు, ఇటు జీఎస్‌డబ్ల్యూఎస్ వర్గాలు దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా బద్ధకిస్తోన్న సచివాలయాల కార్యదర్శులపై చర్యలకు సిఫార్సు చేయకుండా వాళ్లకు కొంతమంది అధికారులు వంత పాడుతున్నారు.

రేషన్ డిపోలలో సరుకులతో పాటు కార్డులు పంపిణీ చేయాలంటే ఇబ్బందే. దీంతో పౌరసరఫరాల కమిషనర్ ఆలోచన చేసి ఇంటింటికి వెళ్లి సచివాలయాల కార్యదర్శులు కార్డులు పంపిణీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రేషన్ దుకాణాన్ని ఒక సెక్రెటరీకి మ్యాపింగ్ చేశారు. వాళ్ల స్మార్ట్‌ఫోన్‌లోనే కార్డు పంపిణీ చేయడానికి యాప్‌ని ఇన్‌స్టాల్ చేశారు. ఆ యాప్ ద్వారా లాగిన్ అయి కార్డు నంబరు నమోదు చేసి లబ్ధిదారుల వేలిముద్రను తీసుకొని కార్డు పంపిణీ చేయాలి. ఇది ఒక విధంగా సామాజిక పింఛన్ల పంపిణీ లాంటిదే. అయినప్పటికీ వారు ఆ పనిచేయడం లేదు. అదేమంటే తమకు క్లస్టర్‌లోని చిరునా మాల గురించి మాత్రమే అవగాహన ఉంటుం దని చెబుతున్నారు. రేషన్ డిపో పరిధిలో కార్డుదారుల చిరునామాలు తెలియవని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

జిల్లాలో 5,88,693 స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. 5వ తేదీ ముగిసినా ఇప్పటివరకు 20శాతం కూడా పంపిణీ చేయ లేదు. గుంటూరు నగరంలో అయితే రెండు నియోజక వర్గాలు కలిపి 20 వేల లోపే కార్డుల ను పంపిణీ చేశారు. ఇందుకు కారణం సచివా లయాల కార్యదర్శులు ఇంటింటికి వెళ్లకపోవ డమే. పైగా రేషన్ షాపు వద్ద కూర్చుని అక్క డికి రమ్మని సమాచారం ఇస్తున్నారు. కుటుం బసభ్యుల్లో ఎవరు వెళ్లినా వాళ్ల పేరు నమోదు చేసి కార్డు పంపిణీ చేయాలి. అయితే కేవలం కార్డు యజమాని వస్తేనే ఇస్తామని వెనక్కు పంపిస్తుండటంతో ఉసూ రుమంటూ ఎండలో వెనుదిరుగుతున్నారు. జిల్లా యంత్రాంగం అంతా తురకపాలెం మరణాలపై కేంద్రీకృతం కావడం, జాయింట్ కలెక్టర్ బదిలీ అవడం, పూర్తిస్థాయి పౌరసరఫరాలశాఖ అధికారి లేకపోవడం వెరసి స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ జిల్లాలో నత్తనడకన కొనసాగుతోంది.

మూతబడిన రేషన్ షాపులు

రేషన్ సరుకుల నిల్వలు కొన్ని దుకాణాల్లో అయిపోయాయని షాపులు తెరవడం లేదు. గుంటూరు నగరంలోని ఆదర్శనగర్ మెయిన్‌రోడ్డు, ఏడో లైనులోని రెండు డిపోలను శుక్ర, శనివారాలలో మూసేశారు. శ్రీరాంనగర్ మెయిన్‌రోడ్డులోని దుకాణం వద్ద నిలువ నీడ లేకపోవడంతో సరుకులు తీసుకొనేందుకు వచ్చిన కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీనివాసరావుపేటలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. పార్వతీపురంలో 155 నంబరు దుకాణం అయితే ఉదయం 10 గంటల తర్వాతే తీస్తున్నారు. దీనిపై తక్షణం అధికారులు దృష్టి పెట్టకపోతే ఈ నెలలో చాలామంది సరుకులకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.



ఆదర్శనగర్‌లో మూతబడిన రేషన్ దుకాణాలు



శ్రీరాంనగర్ మెయిన్‌రోడ్డులో మండుటెండలోనే సరుకులు తీసుకొనేందుకు క్యూకట్టిన ప్రజలు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

217 మందికి స్వయం ఉపాధి కల్పించాలి

● సమీక్షలో సిబ్బందికి మెప్మా పీడీ ఆదేశం



సమీక్షలో పాల్గొన్న చైర్మన్ రఫాని, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీకృష్ణ

చిలకలూరిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకం కింద 217 మందికి వచ్చే మార్చి 8 లోగా బ్యాంకు రుణాలు ఇప్పించి వారితో సంబంధిత ఉపాధి వ్యాపా రాలు ప్రారంభించేలా మెప్మా సిబ్బంది కృషి చేయాలని మెప్మా పీడీ మురళీకృష్ణ శని వారం ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మెప్మా ఆర్‌పీలు, మెప్మా సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం వారు ఇచ్చే సబ్సిడీని పొంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ టిడ్కో గృహాల కేటాయింపుకు సంబంధించి అర్హుల వివరాలు సేకరించాలని కోరారు. సమావేశంలో సీఎంఎం అరిఫా సుల్తానా, కమ్యూనిటీ ఆర్గనైజర్లు అశాలత, శ్రీనివాసరావు, మల్లిబాబు, వనజాక్షి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు

చిలకలూరిపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుమర్రులో మద్ది కామ య్య జడ్పీ హైస్కూల్ ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆంగ్లంలో వంద మార్కులకు గాను 90 మార్కులు కంటే పైబడి మార్కులు తెచ్చుకున్న 9 మంది విద్యా ర్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు షేక్ మహమ్మద్ యాసీన్ మొత్తం రూ.9 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి ప్రదానం చేశారు. 11 సంవ త్సరాల నుంచి ఆయన ఈ విధంగా ప్రోత్సాహక బహుమతులు అందచేస్తున్నారు. కార్య క్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు గద్దె హరిబాబు, విశ్రాంత హెచ్ఎం బి.వెంకటేశ్వర్లు, హెచ్ఎం వై హనుమంతరావు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి కళాశాలలో డిప్లమా ఫ్రెషర్స్ డే



అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమా ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు, శిక్షణ శాఖ రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టీ.అనిల్‌కుమార్ యువతకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ఉద్యోగాల వృద్ధి, శిక్షణ, వివిధ రంగా ల్లో నైపుణ్య ఆధారిత విద్యావ్యవస్థ ప్రాధాన్యంపై చర్చించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఎదురయ్యే అడ్డంకులను అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్ర మంలో డిప్లమా ప్రిన్సిపాల్ కే.కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ పిన్సిపాల్ సీహెచ్ మల్లికా ర్జున, ఫార్మసీ ప్రిన్సిపాల్ పీ భార్గవభూషణ్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు మానుకోవాలి

శావల్యాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి గ్రామంలో వైసీపీ నేతలు బరితెగించి టీడీపీ వర్గీయులపై దాడి చేయడమే కాకుండా కొన్ని పత్రికల్లో తప్పుడు రాతలు రాయించి అసత్యప్రచారాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కారుమంచిలో గురువారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జన వేడుకల్లో వైసీపీ వర్గీయుల దాడిలో గాయాలపాలై చికిత్స పొందు తున్న ముప్పా సురేష్, సోమేపల్లి గోవర్ధన్‌లను టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గత బుధవారం కారు మంచిలో వైసీపీ వారు వినాయక విగ్రహం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తే టీడీపీ వారెవ్వరూ అటువైపు కూడా వెళ్లలేదని, కానీ గురువారం టీడీపీ వారు నిమజ్జనం చేస్తుంటే రాళ్ళు రువ్వి చెడగొట్టేందుకు ప్రయత్నించారని, వందలాది మంది పోలీసులు ఉన్నా టీడీపీ వారిపై కారం చల్లేందుకు పూనుకోగా డ్రోన్ కెమెరాలో రికార్డు అయిందన్నారు. టీడీపీ వారి ఉత్సవాన్ని చెడగొట్టేందుకు పక్కా ప్రణాళికతోనే వైసీపీ వర్గీయులు దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. పక్కాగా ఆధారాలున్నా టీడీపీవారే తమపై దాడి చేసినట్లుగా అసత్య ప్రచారం చేస్తున్నారని, టీడీపీ వారు దాడిచేస్తే వారికే దెబ్బలెలా తగులుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకులు యరమాసు రామకోటేశ్వరరావు, అంగిరేకుల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహావీర గణపతికి సహస్ర నామార్చన పూజ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మద్ది రాఘవయ్య బావి వీధి వద్ద టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ దగ్గర యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహావీర గణ పతికి గరికతో శనివారం సహస్ర నామార్చన జరిగింది. ఈ సందర్భం గా నిర్వహించిన 36 కేజీల లడ్డును వేలంలో రూ.1.80 లక్షలకు సూరెడ్డి శ్రీనివాసరెడ్డి దక్కించుకున్నారు, 26 కేజీల లడ్డును రూ.1.30 లక్షలకు బండి సుబ్రహ్మణ్యం వేలంలో దక్కించుకున్నారు. మహా వీర గణపతి మండపాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య దంపతులు దర్శించుకున్నారు. మేళతాళాలతో నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ వనమా పవన్‌కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపిచర్ల, గోగులపాడు తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. రొంపిచర్లలోని ఎస్‌బీఐ బ్యాంక్, తులసీ కోట, చౌడేశ్వరి అమ్మవారి ఆలయం బజారు, దేవుడు మాన్యం కాలనీలలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ఆరేపల్లి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డును గ్రామానికి చెందిన మోతు కూరి శ్రీనివాసరావు రూ.3.60 లక్షలకు శనివారం వేలంలో దక్కించుకున్నాడు. నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బుచ్చిపాపన్నపాలెం రహదారిలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

వినుకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 13 మంది ఉత్తమ ఉపాధ్యాయలకు శుక్ర వారం రాత్రి రోటరీ నేషన్ బిల్డర్ అవార్డ్స్ 2025తో ఘనంగా సన్మానం చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జఫ్రుల్లా, కౌన్సిలర్ షకీలా ప్రసం గించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను స్థానిక జాషువా కళాప్రాంగణం నందు ఘనంగా సన్మానించి ఆక్సిజన్ ప్లాంట్స్ బహూకరించారు.

విద్యార్థులకు నగదు బహుమతి

నాదెండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండంలోని గణపవరంలో గల కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ సంస్థ నిర్వాహకుల్లో ఒకరైన పెద్ది సుజాత సహకారంతో 9, 10 తరగతులకు చెందిన మెరిట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు. హెచ్ఎం కృష్ణనాయక్, సూపర్‌వైజర్ కే.కోటేశ్వర రావు, ఆర్గనైజర్ కోటి సుబ్బారావు, రసూల్ పాల్గొన్నారు.

యడ్లపాడు మాజీ ఉపసర్పంచ్ సుబ్బారావు మృతి



సుబ్బారావు (ఫైల్)

యడ్లపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మాజీ ఉప సర్పంచ్, ఎంఎస్ ట్రేడర్స్ యజమాని ముత్తవరపు సుబ్బారావు(50) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెం దాడు. సుబ్బారావు కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నా డు. ఆయనకు భార్య ఉమాదేవి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలువురు రాజకీ య ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మర్రి రాజశేఖర్, పుడమి బిల్డర్స్ అధినేత డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, సొమేపల్లి వెంకటసుబ్బయ్య, పలువురు నాయకులు ఉన్నారు.

నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి మాతృవియోగం



వెంకాయమ్మ (ఫైల్)

యడ్లపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సొలస గ్రామాని కి చెంది న సీనియర్ టీడీపీ నాయకుడు, కొండవీడు మేజరు నీటి సంఘం అధ్యక్షుడు మద్దూరి శ్రీనివాసరెడ్డి తల్లి మద్దూరి వెంకాయమ్మ(91) శనివారం మృతి చెందింది. వెంకాయమ్మ మృతి విషయం పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి సొలసలోని శ్రీనివాసరెడ్డి నివాసానికి వెళ్లి వెంకా యమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప లువురు టీడీపీ నాయకులు వెంకాయమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

సీజీఎఫ్ నిధులతో ప్రధాన దేవాలయాల అభివృద్ధి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



నూతన ధర్మకర్తల మండలి సభ్యుల పదవీ స్వీకార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రధాన దేవాలయాలన్నింటిని ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి చేస్తున్న ట్టు రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం తెలిపారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో గల సీతారామస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానం అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించానని, తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు, ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి రూ.45 లక్షల నిధులు సమకూర్చినట్లు వివరించారు. పురుషోత్తమ పట్నంలోని వేణు గోపాలస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.కోటి 30 లక్షలు, తుర్లపాడులోని దేవాలయానికి రూ.కోటి వరకు నిధులు మంజూరు చేయించానని తెలిపారు. దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా గ్రంధి భాస్కరరావు, ధర్మకర్తలుగా అర్వపల్లి వీరాంజనేయులు, వెల్లంపల్లి శ్రీరాములు, గోపీనాథ్ శాస్త్రి, కే శ్రీనివాసరావు, గుళ్ళ రామాంజి, మాధవ, జరపాల మోతీబాయి, ఎక్స్ అఫిషియో సభ్యులుగా దీవి మాధవరామాచార్యులు ప్రత్తి పాటి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖు లు, సీనియర్ టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రూ.24.76 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట నియోజకవర్గంలోని 45 మందికి రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.24.76 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం తన నివాసంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, జవ్వాజి మదన్ మోహన్, మద్దుమాల రవి, పిల్లి కోటేశ్వరరావు, తుపాకుల అప్పారావు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన కే-రిడ్జి విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ తదితరులు

చెస్ పోటీల్లో కే-రిడ్జి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఆగస్టు 31న జరిగిన రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జీ.బర్న బాస్ శనివారం తెలిపారు. ఎస్.శశాంక్ 5 పాయింట్లు, సీహెచ్ వెంకట సంజయ్ 4 పాయింట్లు, జీ సందీప్ 4 పాయింట్లు, ఈ వివేకొరెడ్డి 3.5 పాయింట్లు, టీ.శశాంక్ 3 పాయింట్లు, టీ తేజా 4 పాయింట్లు, జీ.సుజిత్ తేజా 3 పాయింట్లు సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, చెస్ కోచ్ కోటేశ్వరరావు అబినందించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

నసరావుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు నిర్వహించామని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శనివారం తెలిపారు. విద్యార్థులు అధ్యక్షత వహించి వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. తరువాత పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి శిబిరానికి ఎన్‌ఈసీ క్యాడెట్ల ఎంపిక



మణికుమార్



పి.లిఖిత

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయస్థాయి సైనిక్ క్యాంపునకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ చిన్నం మణికుమార్, సార్జెంట్ పి.లిఖిత నందిని ఈ ప్రతిష్ఠాత్మక క్యాంపునకు ఎంపికైనట్లు చెప్పారు. సెప్టెంబరు 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ చక్రవర్తి, సెక్రటరీ రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు విద్యార్థులను, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్‌ను అభినందించారు.

రైతులు అవసరానికి మించి ఎరువులు తీసుకోవద్దు

● వినుకొండ ఏడీఏ రవికుమార్



ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ రవికుమార్

శావల్యాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు రైతులు అవసరానికి మించి ఎరువులు తీసుకొని నిల్వ పెట్టుకోవడం వల్ల మిగిలిన రైతులు ఇబ్బందిపడే అవకాశం ఉంది కావున విడతలవారీగా ఎరువులు తీసుకోవాలని వినుకొండ ఏడీఏ రవికుమార్ తెలిపారు. శావల్యాపురంలోని సొసైటీ కార్యాలయంలో జరుగుతున్న ఎరువుల పంపిణీని శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ శావల్యాపురం సొసైటీకి 20టన్నులు యూరియా వచ్చిందని, కొంతమంది రైతులకు పంపిణీ చేశామని, మార్క్‌ఫెడ్ నుంచి ఆదివారం సాయంత్రానికి మరలా యూరియా రానుందని, మిగిలిన రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు. రైతులు వీఏఏలతో ఈ-క్రాప్ నమోదు చేయించుకొంటే ప్రభుత్వమందించే రాయితీలు అందుతాయన్నారు.

వైద్యమిత్రలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

వినుకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్యమిత్రలకు హెచ్‌ఆర్ పాలసీతో పాటు జీతాలు పెంపుదల చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన వైద్య మిత్ర కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అం దించాలనే ఉద్దేశంతో ఆరోగ్య బీమా నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనరల్ యూనియన్ పలనాడు జిల్లా కార్యదర్శి వెంకటే శ్వర్లు యూనియన్ నాయకులు హనుమంతరావు, హరిబాబునాయక్, మహేశ్వరి తదిత రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాచర్ల బుజ్జి

మహిళల జీవనోపాధి మెరుగునకు కృషి చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీలక్ష్మి



సీసీలు, వీవోఏలతో మాట్లాడుతున్న పీడీ ఝాన్సీలక్ష్మి

శావల్యాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలకు మెరుగైన జీవనోపాధి మార్గాలపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు సీసీలు, వీవోఏలు నిరంతరం కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీలక్ష్మి తెలిపారు. శావల్యాపురం మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు చిరువ్యాపారాలు, కిరాణా దుకాణాలు, షేడ్ నెట్ తయారీ, కొరమీనుల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. డ్వాక్రా సంఘాల్లోని ప్రతి మహిళను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆన్‌లైన్‌లో ఉన్న మహిళలకు మాత్రమే రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో శావల్యాపురంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి ప్రక్కన కొత్తగా ఏర్పాటు చేయనున్న జండార్ కేంద్రం అద్దె భవనాన్ని ఆమె పరిశీలించారు. ఈనెల 15వతేదీకల్లా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, కార్యదర్శి వేగుల కుమారి, జీనోపాధుల డీపీఎం డేవిడ్, ఉన్నతి డీపీఎం శ్రీనివాసరావు, బ్యాంక్ లింకేజీ ఏపీఎం వాసుబాబు, ఇన్‌చార్జి ఏపీఎం రామారావు, కే3 షేడ్‌నెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి : ఎంపీపీ

నాదెండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీపీ తలతోటి రాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పని తీరుపై ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నార న్నారు. అధికారులు, కార్యదర్శులు గ్రామా ల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, ఏఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు టీడీపీ నాయకుల అభినందనలు

బొల్లాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన బొల్లాపల్లి ఎంపీడీవో పీ మాధురిని బొల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు పెసల వెంకట నారాయణ, పలువురు టీడీపీ నాయకులు ఎంపీడీవోను శనివారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు పెసల వెంకట నారాయణ మాట్లాడుతూ వెనుకబడిన బొల్లాపల్లి మండలానికి తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. టీడీపీ నాయకులు ఎస్‌వీ చారిటబుల్ అధినేత పోకా వెంకటరావు, అర్దలపూడి శ్రీనివాసరావు, సక్రునాయక్, ఏడుకొండలు నాయక్, బాబూ రావు, కొండలు, బైలడుగు శ్రీనివాసరావు, హనుమానాయక్ ఉన్నారు.

పాఠశాలకు 50 ట్రీగార్డుల అందజేత

వినుకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలోని జడ్పీ హెచ్ పాఠశాలకు 20వ వార్డు కౌన్సిలర్ నంది నరసింహారావు పాఠశాల ఆవరణలోని 50 మొక్కలకు ట్రీ గార్డులను అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరప్పయ్య తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావును శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో పాఠశాల పీడీ రాధాకృష్ణమూర్తి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పద్మజ, ఎలీషా, రాంబాబు ఎలిజిబెత్ రాణి, మల్లయ్య, శాంతి, గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఈ-క్రాపు నమోదు చేయించుకోవాలి

బొల్లాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బొల్లాపల్లిలో జరుగుతున్న ఉద్యాన పంటల ఈ-క్రాపు నమోదు కార్యక్రమాన్ని ఉద్యానశాఖ అధికారి ఎస్‌కే నబీ రసుల్లా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొబ్బరి, మిరప, ఇతర పండ్ల తోటల ఈ-క్రాపు నమోదు ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ-క్రాపు నమోదు వల్ల వాటి ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ఈ-పంట నమోదు కార్యక్రమం ఈనెల 30తో గుడువు ముగియనుంది. కావున రైతులందరూ తమ ఉద్యాన పంటలను నమోదు చేయించుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో శెట్టి భార్గవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ముగ్గురు విద్యుత్ ఏఈలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఏఈలుగా చిలకలూరిపేట టౌన్-1 కు ఎన్ కమలాకర్, రూరల్ సెక్షన్‌కు ఎండీ మోయిన్ పాషా, గణపవరంనకు కే. కోటేశ్వరరావు కొత్తగా బాధ్యతలు స్వీకరించినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఏపీసీపీడీసీఎల్‌లో జూని యర్ ఇంజనీర్‌లుగా ఉన్న వీరు ఏఈలుగా పదోన్నతి పొందారని చెప్పారు.

నేడు సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు

రొంపిచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు జరగనున్నట్లు గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు వంశీ కృష్ణారెడ్డి, సెక్రటరీ సామంత్‌రెడ్డి, ఎగ్జిక్యూ టీవ్ మెంబరు రంజాన్‌బీ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. బాలు ర, బాలికల విభాగంలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. జనవరి 1, 2011 తరువాత పుట్టిన వారు మాత్రమే అర్హులన్నారు. ఎంపికల్లో పాల్గొనే వారు ఉదయం 9 గంటలకు ఆధార్, పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రాలతో పాఠశాల వద్దకు రావాలన్నారు. వివరాలకు 95818 88902, 79951 51556లను సంప్రదించాలన్నారు.



పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కూటమి నాయకులు

ఆదర్శ మున్సిపాలిటిగా తీర్చిదిద్దేందుకు కృషి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నరసరావుపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 24వ వార్డులో శనివారం శానిటేషన్ కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటి సిబ్బందితో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. వార్డులోని ప్రధాన రహ దారులు, డ్రెయినేజీ వ్యవస్థలు, సామాజిక ప్రాంతాలను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీ సాధ్యం అవుతుందన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బోరింగ్ పంపులు ప్రారంభం

పట్టణంలో నూతనంగా నిర్మించిన బోరింగ్ పంపులను ఎమ్మెల్యే అర విందబాబు శనివారం ప్రారంభించారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం వద్ద ఒకటి, చంద్రబాబునాయుడు కాలనీలో రెండు, ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద రెండు బోరింగ్ పంపులను ప్రారంభించారు. నెల రోజుల క్రితం చిలకలూరిపేట అసిస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఈ బోరింగ్ పంపుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దాసరి నరసింహారావు, నల్లపాటి చిన్నబ్బాయి. కూటమి నాయకులు, మహిళలు, అసిస్ట్ స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీఎల్ మోడల్ హైస్కూల్లో ఎమ్మెల్యే తనిఖీ

పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో ఉన్న అల్లూరి సీతారామరాజు ఎంపీఎల్ మోడల్ హైస్కూల్‌ను ఎమ్మెల్యే అరవిందబాబు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధ్యాయుల సమయపాలన అనే అంశాలను పరిశీలించారు. రిజిస్టర్‌ను పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రక్రియ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



నేషనల్ బిల్డర్ అవార్డు సర్టిఫికెట్లు పొందిన ఉపాధ్యాయులతో రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ కరీమ్ మొహిద్దీన్ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా నేషనల్ బిల్డర్ అవార్డు సర్టిఫికెట్‌తో ఉపాధ్యాయులను సత్కరించామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ కరీమ్ మొహిద్దీన్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయుకే నరసరావుపేట ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, బొందిలి సత్య నారాయణసింగ్, కనపర్తి హనుమయ్య, గోనుగుంట్ల భవాని, తుమాటి రవికాంత్, షేక్ ఖాదర్ మస్తాన్‌లను నేషనల్ బిల్డర్ అవార్డు సర్టిఫికెట్‌తో సన్మానించారు. కార్యక్రమంలో తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, జమ్ముల రాధాకృష్ణ, లింగా ఆంజనేయులు, కేవీ ఆంజనేయులు, సుమి త్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్ రవినాయక్‌కు సన్మానం

రొంపిచర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో గల పీఎం శ్రీఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రవినాయక్ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఈనెల 5న అవార్డు అందుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ రవినాయక్‌ను సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

బేరియాట్రిక్ సర్జరీలో డాక్టర్ ప్రసన్న కుమార్‌కు పట్టా



డాక్టర్ మోహిత్ బండారి నుంచి పట్టా అందుకుంటు న్న డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్

రొంపిచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ గ్యాస్ట్రో లివర్ వైద్యు డిగా పని చేస్తున్నారు. ఆయన ఇండోర్‌లో బేరియాట్రిక్ సర్జరీకి సంబం ధించి శిక్షణ పొందారు. ఈ మేరకు ప్రసిద్ధ బేరియాట్రిక్ సర్జరీ నిపుణుడు డాక్టర్ మోహిత్ బండారి నుంచి పట్టా పొందినట్టు శనివా రం తెలిపారు. ఈ సర్జరీలో శిక్షణ పొందటం తన కల అని పేర్కొన్నా రు. ఒబేసిటీ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న సమస్య అని తెలిపారు. కేవలం రూపం, బరువు సమస్య మాత్రమే కాకుండా మిగి లిన వ్యాధులకు దారి తీస్తుందన్నారు. నరసరావుపేట పరిసర ప్రాంతా ల్లో ఆధునిక బేరియాట్రిక్ చికిత్సలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

పేద విద్యార్థులకు ఆరంబ్‌ఎడ్యూ ట్రస్టు తోడ్పాటు

కొత్తలూరు(శావల్యాపురం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పేదవిద్యార్థులకు ఆరంబ్‌ఎడ్యూ ట్రస్టు ప్రతినిధులు వివిధ వసతులను కల్పిస్తూ వారికి ఎంతో తోడ్పాటునందిస్తున్నారని పాఠశాల హెచ్ఎం కొలుసు వీరాంజనేయులు కొనియాడారు. మండలంలోని కొత్తలూరు ప్రాథమిక పాఠశాలల్లో ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన స్టీలు ప్లేట్లు, గ్లాసులు శనివారం పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు రాజారమేష్ మాట్లాడుతూ పేదలకు సహకరించాలనే లక్ష్యంతో ఆరంబ్‌ఎడ్యూ ట్రస్ట్ ఏర్పాటు చేశామని అన్నారు.

బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి ఘన సత్కారం

వినుకొండటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుపాలెంలో గల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.ఎలీషా వినుకొండ ఎన్ఎస్‌పీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏనుగుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయుడు ఎలీషాను ఉపాధ్యాయిని బి.శైలజ, మురళీకృష్ణ, వెంకటరమణ, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

● సచివాలయ సహాయ ఇంజనీర్ల విన్నపం

నాదెండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు నిర్వహించిన విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని మండలంలోని సచివాలయ సహాయ ఇంజనీర్లు శనివారం విన్నవించారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లును కలసి వారు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనులకే తాము సమయాన్ని కేటాయిస్తున్నామని వివరించారు.